సాక్షి కామారెడ్డి

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



సభ్యత్వం చేపట్టాలి

బీజేపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు.

- 8లో ▸



ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలంటూ విద్యార్థులు రాస్తారోకో చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.8 /19.8

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



కామారెడ్డి క్రైం: రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తన చాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు.

స్థల పరిశీలన



తాడ్వాయి: చిట్యాల శివారులో సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం మంగళవారం విద్యుత్ అధికారులు, నేతలు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు మాట్లాడుతూ చిట్యాల, సంతాయిపేట, సోమారం, సోమారం తండాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్ మంజూరయ్యిందన్నారు. గ్రామస్తులు తీర్మానం చేసి, విద్యుత్ శాఖ పేరుపై భూమిని రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. డీఈ కళ్యాణ చక్రవర్తి, ఏడీఈ కిరణ్‌చైతన్య, ఏఈ కరుణాకర్, సబ్‌ఇంజినీర్ శివతేజ, లైన్‌ఇన్‌స్పెక్టర్ రాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక



కామారెడ్డి టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం కామారెడ్డిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించారు. అండర్ 14 బాలబాలికల విభాగాలలో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ప్రతిభ చూపినవారిని జిల్లా బాలబాలికల జట్లకు ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అనురాధ, విద్యాసాగర్, రాజేష్, స్వామిగౌడ్, భాస్కర్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే ప్రతిపాదనలు

- బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ వెల్లడి
- కలెక్టరేట్‌లో రిజర్వేషన్లపై బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోందని, ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై అధ్యయనం చేసేందుకు బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపడుతోందని కమిషన్ చైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు. డిసెంబర్ 9లోగా రాష్ట్ర ప్రభుత్వంతోపాటు హైకోర్టుకు నివేదిక అందజేస్తామన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావులు పాల్గొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, వర్గీకరణ చేపట్టాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 128 వినతులు కమిషన్‌కు అందాయి.



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్.. వేదికపై సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: ప్రజాభిప్రాయం మేరకే రిజర్వేషన్లకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచుతామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. ప్రజల సలహాలు, సూచనలను, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వెల్లడయ్యే అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలను స్వీకరించేందుకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మితో కూడిన బృందం మంగళవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. బీసీ సంఘాల నాయకులతోపాటు వివిధ వర్గాల వారు హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్‌కు అందించారు. మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పర్యవేక్షణలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నిర్దేశిత నమూనాలో అఫిడవిట్‌తో కూడిన వినతులు కమిషన్‌కు సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

శాస్త్రీయ పద్ధతిలో..

రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రతిపాదనలను రూపొందించేందుకు బీసీ కమిషన్ కసరత్తు చేస్తోందని చైర్మన్ నిరంజన్ అన్నారు. కమిషన్ విధివిధానాలను ఆయన వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోందని, ఇందులో భాగంగా స్థానిక సంస్థల్లో ఆయా వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై అధ్యయనం కోసం బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపడుతోందన్నారు. బీహార్‌లో 62 శాతం బీసీల జనాభా ఉందన్నారు. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేయాలని అక్కడి ప్రభుత్వం భావించగా, ఆ రాష్ట్ర హైకోర్టు నిరాకరించిందన్నారు. కర్ణాటకలో సైతం సర్వే నిర్వహించినప్పటికీ గత దశాబ్ద కాలంగా నివేదికను వెల్లడించలేని స్థితి నెలకొందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. కుటుంబ సర్వేలో పూర్తి సమాచారం అందించేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కుల సంఘాల ప్రతినిధులను కోరారు. నవంబర్ 13వ తేదీ వరకు సర్వే పూర్తవుతుందని, అనంతరం ఆన్‌లైన్‌లో డేటాను నిక్షిప్తం చేసి డిసెంబర్ 9 లోగా నివేదిక అందజేస్తామని తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

బహిరంగ విచారణకు హాజరయ్యే వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. నిర్దేశిత నమూనాలో వినతులు అందించేలా సహకరించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, వివిధ సంఘాల ప్రతినిధులు కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ సతీశ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

128 విజ్ఞప్తులు

- స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- రాజకీయ, విద్య, ఉద్యోగ ఆర్థిక, సామాజిక రంగాల్లో తోడ్పాటు అందించాలి
- జిల్లాలో బీసీ భవన్ నిర్మించాలి

నిజామాబాద్‌అర్బన్: బీసీ కమిషన్‌కు ఉమ్మడి జిల్లా నుంచి వినతులు వెల్లువెత్తాయి. నిజామాబాద్ నుంచి 102 , కామారెడ్డి నుంచి 26 వినతులు వచ్చాయి. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, వర్గీకరణ చేపట్టాలని ప్రధానంగా డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీ కులాల జనాభాను లెక్కించి ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ, ఉపాధి రంగాలలో వారి స్థితిగతులు తెలుసుకొని ఆయా రంగాలలో మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి బీసీ కమిషన్‌కు సమర్పించిన వినతిలో పేర్కొన్నారు. బీసీ కుల వృత్తులలో కొనసాగుతున్న వారు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా ప్రణాళికలు రచించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఇప్పుడున్న 23 శాతం రిజర్వేషన్ బీసీ జనాభాకు సరిపోదన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రూ. 20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

మున్నూరు కాపు ఇంటలెక్చువల్ ఫోరం సమర్పించిన నివేదికలో మున్నూరు కాపులకు 100 శాతం సబ్సిడీపై విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందిచాలన్నారు. భూమిలేని మున్నూరు కాపులకు మూడెకరాల భూమి ఇవ్వాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుప్పాల రవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కెంపుల నాగరాజు తదితరులు ఉన్నారు. బీసీ కులగణన చేసి బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీనారాయణ బీసీ కమిషన్‌ను కోరారు. వీరశైవ జంగమ కులస్తులు వారి స్థితిగతులు, రిజర్వేషన్ల వివరాలను బీసీ కమిషన్‌కు తెలియజేశారు. జంగమ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటునందించాలన్నారు.

స్టడీ సర్కిల్‌కు స్థలం కేటాయించాలి

బీసీల అభ్యున్నతి, సంక్షేమంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమగ్ర వివరాలను సమర్పించింది. రాజకీయ, విద్య, ఉద్యోగ ఆర్థిక సామాజిక రంగాల్లో బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు నాగరాజ్ కోరారు. జిల్లాలో బీసీ భవన్ నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్‌కు రెండెకరాల స్థలం కేటాయించాలన్నారు. కాలేజీ హాస్టళ్లలో సీట్లను రెట్టింపు చేయాలన్నారు. కులగణన సర్వే విజయవంతం చేస్తామన్నారు.

బురుడుగల్లీ సందర్శించిన బీసీ కమిషన్



మేదరి కులవృత్తిని పరిశీలిస్తున్న చైర్మన్ నిరంజన్, సభ్యులు

నిజామాబాద్‌అర్బన్: బీసీ కమిషన్ సభ్యులు మంగళవారం రాత్రి నిజామాబాద్ నగరంలోని బురుడుగల్లీ ప్రాంతాన్ని సందర్శించి, మేదరి కులస్తుల జీవన స్థితిగతులను పరిశీలించారు. కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ మేదరి కులస్తులకు చెందిన ఒక్కో ఇంటిని సందర్శిస్తూ, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితి గురించి తెలుసుకున్నారు. వెదురుతో తయారు చేసిన ఉత్పత్తులు పరిశీలించారు. మేదరి వృత్తిపై ఆధారపడిన తాము దుర్భర జీవితాలు వెళ్లదీస్తున్నామని, తమను ఇతర రాష్ట్రాల తరహాలో ఎస్టీ జాబితాలో చేర్చాలని, జీవనోపాధిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టేలా సిఫార్సు చేయాలని మేదరి కులస్తులు కోరారు. తాము పరిశీలించిన అంశాలను ప్రభుత్వానికి నివేదించి, ప్రత్యేక తోడ్పాటు అందించాల్సిందిగా సిఫారసు చేస్తామని కమిషన్ సభ్యులు హామీ ఇచ్చారు. వారి వెంట జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి స్రవంతి, తహసీల్దార్ బాలరాజు ఉన్నారు.



బహిరంగ విచారణలో పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు

సర్వేకు వేళాయె!

- వచ్చే నెల 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
- 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, పది బ్లాకులకో సూపర్‌వైజర్..
- జిల్లాలో 3 లక్షల కుటుంబాలను సర్వే చేయనున్న బృందాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. అన్ని కుటుంబాలకు సంబంధించిన కుల, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయాలకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరించనున్నారు. కాగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు సర్వేకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్యుమరేటర్లను, సిబ్బందిని నియమించి వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. మండల స్థాయి అధికారులు ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పించాల్సి ఉంది.

56 అంశాలు..

సర్వే సిబ్బంది ఇంటి యజమాని నుంచి ఫార్మట్‌లో పేర్కొన్న విధంగా 56 అంశాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. కుటుంబ యజమాని, కుటుంబ సభ్యులు, కులం, వయసు, మాతృభాష, ఆధార్, మొబైల్ నంబర్, వైకల్యం ఉంటే వివరాలు, వైవాహిక స్థితి, చదువు, బడి మానేస్తే ఏ తరగతిలో మానేశారు అన్న వివరాలు తెలుసుకుంటారు. ప్రస్తుతం చేస్తున్న పని, వృత్తి, ఉద్యోగం, స్వయం ఉపాధి, వ్యాపార వివరాలు, పారిశ్రామికవేత్త అయితే వార్షిక టర్నోవర్, రోజువారీ వేతన కార్మికులు అయితే ఏ అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు, సంప్రదాయ కుల వృత్తులు అయితే ఏ కుల వృత్తిలో కొనసాగుతున్నారు, కుల వృత్తి వల్ల కలిగిన వ్యాధి వివరాలు సేకరించనున్నారు. వార్షిక ఆదాయం, ఆస్తులు, బ్యాంకు అప్పుల వివరాలు కూడా ప్రొఫార్మాలో నమోదు చేస్తారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులా, బ్యాంకు ఖాతా ఉందా, భూమి ఉందా, ఉంటే ధరణి పాస్‌బుక్ నంబరు, పట్టాభూమి/అసైన్డ్‌భూమి/అటవీ హక్కు భూమి, తరి/మెట్ట/పడావు, నీటి పారుదల వనరు, కౌలు భూమిలో సాగు చేస్తున్నట్టయితే విస్తీర్ణం వివరాలు తీసుకోనున్నారు. రిజర్వేషన్ విధానం నుంచి పొందిన విద్య/ఉద్యోగ ప్రయోజనాలు, ఐదేళ్లుగా లబ్ధిపొందిన పథకాల పేర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు చెందిన వారైతే కుల ధ్రువీకరణ పత్రం పొందారా, డీనోటిఫై చేయబడిన సంచార జాతులకు చెందిన వారా అన్న వివరాలను సేకరిస్తారు. కుటుంబ సభ్యుల రాజకీయ నేపథ్యం గురించి కూడా ప్రభుత్వం వివరాలు సేకరించనుంది. కుటుంబంలో ఎవరైనా ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలసవెళ్లి ఉంటే వారికి సంబంధించిన వివరాలు, వలసలకు కారణాలను కూడా అధికారులు నమోదు చేసుకోనున్నారు. కుటుంబానికి ఉన్న అప్పులు, వాటిని ఏ అవసరం నిమిత్తం, ఎక్కడినుంచి తీసుకున్నారు, కుటుంబానికి చెందిన పశు సంపద, స్థిరాస్తి వివరాలు, రేషన్ కార్డు నంబరు, నివాస గృహం విస్తీర్ణం, నివాస గృహం రకం, తాగునీటి వనరు, ఇంటికి విద్యుత్ సదుపాయం ఉందా, నివాస గృహం ఉన్న ప్రాంతం యొక్క స్వభావం, యాజమాన్య స్థితి, ఇంటిలోని గదుల సంఖ్య, మరుగుదొడ్డి ఉందా, వంట కోసం ఉపయోగించే ఇంధనం వంటి వివరాలు సేకరించనున్నారు.



డిప్యూటీ సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

సమగ్ర సర్వేపై డిప్యూటీ సీఎం సూచనలు

కామారెడ్డి క్రైం: సమగ్ర సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. సర్వేపై సూచనలు ఇచ్చారు. సర్వే షెడ్యూల్‌పై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు పాల్గొన్నారు.

2 వేల మంది ఎన్యుమరేటర్లు..

జిల్లాలో సుమారు 3 లక్షల కుటుంబాలు ఉన్నాయి. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించనున్నారు. పది మంది ఎన్యుమరేటర్‌లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకోసం ప్రతి మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా ఉండనున్నారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ఇంటి యజమానితో మాట్లాడి ఎనిమిది పేజీల్లో ఉండే ప్రొఫార్మాలోని 56 అంశాలకు సంబంధించిన వివరాలను అందులో నమోదు చేస్తారు. సూపర్‌వైజర్లు పది శాతం ఇళ్లను ర్యాండంగా ఎంచుకుని డాటాను తనిఖీ చేయాల్సి ఉంటుంది. సర్వేకు సుమారు 2 వేల మంది ఎన్యుమరే టర్లు, 2 వందల మంది సూపర్‌వైజర్లను నియమించనున్నారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- నాలుగు నెలల్లో రెండు ఉద్యోగాలు సాధించిన యాదగిరి
- అనారోగ్యంతో మృతి



యాదగిరి (ఫైల్)

నాగిరెడ్డిపేట: తల్లిదండ్రుల కష్టాలు తీర్చాలని కష్టపడి చదివి కొలువు కొట్టాడు. అయితే ఆ ఆనందం అతడి కుటుంబంలో ఎంతోసేపు నిలవలేదు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి.

మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన వరిగె యాదగిరి (30) చిన్నప్పుడు తండ్రి నర్సింలుతో కలిసి సైకిల్‌పై తిరుగుతూ డబల్‌రొట్టెలు అమ్మేవాడు. తర్వాత తండ్రి ఆటో నడపగా.. తల్లి బట్టలు కుట్టి కుటుంబానికి అండగా నిలిచారు. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల కష్టం తెలిసిన యాదగిరి.. సర్కారు ఉద్యోగం సాధించాలన్న కసితో చదివాడు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం లింగంపేటలోని బీసీ గురుకుల పాఠశాలలో ఉద్యోగం వచ్చింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం యాదగిరి డీఎస్సీ- 2024లో స్కూల్ అసిస్టెంట్(మ్యాథమెటిక్స్) లో జిల్లా టాపర్‌గా నిలిచి.. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలను ఎంపిక చేసుకున్నాడు. అయితే అనారోగ్యం కారణంగా పాఠశాలలో సెలవుపెట్టి ఆస్పత్రిలో చేరాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మంగళవారం యాదగిరి ఆత్మశాంతికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. యాదగిరితో కలిసి పనిచేసిన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

- విద్యార్థులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఎస్సీ బాలుర హాస్టల్ సందర్శన



హాస్టల్‌లో సౌకర్యాల గురించి ఆరా తీస్తూ..

కామారెడ్డి క్రైం: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, చక్కగా చదువుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా సమీపంలోగల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు, దినచర్య, బోధన తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదివి, మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. విద్యార్థులకు నోటు బుక్కులు అందించి, వారితో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లోని గదులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, సహాయ సంక్షేమ అధికారి వెంకటేశ్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి యాదగిరి, తహసీల్దార్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

జిల్లాలో ఓటర్లు 6,86,456

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ముసాయిదా ఓటరు జాబితా విడుదల

కామారెడ్డి క్రైం : జిల్లా ఎన్నికల విభాగం పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలలో 6,86,456 మంది ఓటర్లు ఉన్నట్లు తేలిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబితాలో అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే వచ్చే నెల 28వ తేదీలోగా సమర్పించాలన్నారు. వచ్చేనెల 9, 10 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అభ్యంతరాలను డిసెంబర్ 24వ తేదీలోగా పరిష్కరించి, జనవరి 6 న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, తహసీల్దార్ జనార్దన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కామారెడ్డి	1,23,324	1,33,415	20	2,56,759
ఎల్లారెడ్డి	1,07,737	1,17,196	3	2,24,936
జుక్కల్	1,00,358	1,04,393	10	2,04,761

'కొనుగోళ్లకు కమిటీలు ఏర్పాటు చేయాలి'

కామారెడ్డి క్రైం : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగంగా చేపట్టడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సివిల్ సప్లయ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లకు మండల, డివిజన్ స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రైస్ మిల్లుకు ఒక వ్యవసాయ విస్తీర్ణ అధికారిని అనుసంధానం చేయాలన్నారు. మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి వేగంగా ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, ఏఎస్‌వో నరసింహారావు, మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

సర్వేను పక్కాగా నిర్వహించాలి

సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేపై కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా సర్వే చేయాలన్నారు. సర్వే కోసం ఎన్యుమరేటర్‌లను నియమించి, శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల మూడు, ఐదవ సెమిస్టర్(రెగ్యులర్), రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ 2020–23 బ్యాచ్ విద్యార్థులు థియరీ ప్రాక్టికల్స్ ఫీజు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కంట్రోలర్ అరుణ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 4వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ. 100 అపరాధ రుసుముతో నవంబర్ ఐదవ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉంద న్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రోబోటిక్స్ వర్క్‌షాప్

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో సోహమ్ అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై విద్యార్థులకు ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించినట్లు పాఠశాల రోబోటిక్స్ నిర్వహణ బాధ్యుడు పి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సెలెన్స్ డైరెక్టర్ కోమరగిరి సహదేవ్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధరాంరెడ్డి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, నిర్వాహకులు పవన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



కామారెడ్డి టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించారు. అండర్–14, 17 బాల,బాలికల విభాగాల్లో వెయ్యికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా ప్రతిభ చూపిన 72 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్ కుమార్, స్వామి గౌడ్, శ్రీనివాస్, నాగరాజు, శివ గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్‌గా సాయిబాబాగౌడ్



ఆర్మూర్: ఎట్టకేలకు ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ఎంపిక ప్రక్రియ పూర్తయింది. బీసీ జనరల్ రిజర్వేషన్‌తో చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్‌గా విఠం జీవన్, 18 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గాన్ని నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. డైరెక్టర్లుగా సురకంటి చిన్న గంగారాం, కల్లూరి చిన్న వూశన్న, అజ్మీర్ పీర్‌సింగ్, కనక రవికుమార్, మట్ట అమృతరావు, మామిడి చంద్రశేఖర్‌రెడ్డి, సయ్యద్ ఫయాజ్, కళ్లెం మల్లారెడ్డి, పింజ ఉషారాణి, బూస మల్లయ్య, మొహమ్మద్ మీరొద్దీన్, ముత్యం సంతోష్‌తో పాటు పెర్మిట్ పీఏసీఎస్ చైర్మన్, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ డైరెక్టర్లుగా కొనసాగుతారు. అనంతరం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నూతన పాలకవర్గానికి నియామక ఉత్తర్వులను అందజేశారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడో..?

- కేంద్రాలకు చేరుతున్న ధాన్యం
- అకాలవర్షాలతో రైతుల్లో ఆందోళన
- రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్న పలువురు రైతులు


లింగాపూర్ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబెడుతున్న రైతులు

కామారెడ్డి రూరల్: దసరా పండుగ నుంచి వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామన్న ప్రభుత్వ ప్రకటన ఆచరణలో అమలు కావడం లేదు. ప్రభుత్వ ప్రకటనతో వరికోతలు చేపట్టిన రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోతుండగా మరోవైపు వర్షాల భయానికి రైతులు ముందస్తుగా వరికోతలు చేపట్టారు. కొనుగోలు కేంద్రాలను ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజు రైతులు కేంద్రాల్లో పొద్దంతా ధాన్యం ఆరబెట్టడం, సాయంత్రం కాగానే వర్షం భయానికి ధాన్యం కుప్ప చేసే పనుల్లోనే నిమగ్నమయ్యారు. పదిహేను రోజుల నుంచి కేంద్రాల్లోనే ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది.

14,160 వేల ఎకరాల్లో సాగు

కామారెడ్డి మండలంలో వానాకాలం సీజన్లో 14,160 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. దీనిలో సన్నరకం 2,252 ఎకరాలు, దొడ్డురకం 11,908 ఎకరాలు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడంతో పలువురు రైతులు సన్న రకాన్ని సాగు చేశారు. అయితే పొట్టదశలో దోమపోటు, మొగిపురుగు తెగుళ్లు సోకడంతో రసాయన మందులు పిచికారీ చేసి పంట కాపాడుకున్నారు. ప్రభుత్వం ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాలు రూ.2,320, బి– గ్రేడ్ రూ.2,300 ప్రకటించడంతో పలువురు రైతులు కేంద్రాల్లోనే విక్రయించేందుకు ధాన్యం తీసుకొస్తున్నారు. కొందరు రైతులు మాత్రం నేరుగా మిల్లర్లకు క్వింటాలుకు రూ.1,850 నుంచి రూ.1,900 చొప్పున విక్రయిస్తున్నారు.

దీపావళి అనంతరమే కొనుగోళ్లు

వానాకాలం సీజన్ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ దీపావళి పండుగ అనంతరమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టే అవకాశముంది. కామారెడ్డి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో 12 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 9 కేంద్రాలు ప్రారంభించారు. అయితే ఆయా కేంద్రాలకు ఇప్పటి వరకు రైసుమిల్లులను కేటాయించకపోవడంతో ధాన్యం కొనుగోళ్లపై అయోమయం నెలకొంది. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ మిల్లర్లు ధాన్యం దించుకునే అవకాశం లేకపోవడంతో అధికారులకు ఏమిచేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

త్వరగా ప్రారంభించాలి



రెండు ఎకరాల దొడ్డు రకం ధాన్యం తీసుకొచ్చా. పచ్చిగా ఉండటంతో నాలుగు రోజుల నుంచి ధాన్యం ఆరబెడుతున్నా. కేంద్రాలను ప్రారంభించకపోవడంతో వర్షాల భయంతో కొందరు రైతులు రైసు మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి.

– శైలజ, రైతు, లింగాపూర్

ఆరబెట్టడంతోనే సరిపోతోంది



మూడు ఎకరాల్లోని వరి పంటను హార్వెస్టర్‌తో కోయించి ధాన్యం తీసుకొచ్చా. వారం రోజుల నుంచి ధాన్యం ఆరబెడుతున్నా. వర్షాలు పడుతుండటంతో ధాన్యం తడిసిపోకుండా కుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్నా. ధాన్యం ఆరబెట్టడంతోనే కాలం గడిచిపోతోంది.

– కెబీ రమేష్, రైతు, లింగాపూర్

టార్పాలిన్లు అందించాలి



రైతులకు వరి కోసిన తర్వాత ఆరబెట్టుకోవడానికి టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో రోజుకు 20 రూపాయల చొప్పున కిరాయి తేవాల్సి వస్తుంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికి టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో రైతులకు అదనపు భారం పడడమే కాకుండా వర్షం వస్తే వడ్లు తడిసిపోతున్నాయి.

– మధు, రైతు, లింగాపూర్

క్రియాశీల సభ్యత్వం ముమ్మరంగా చేపట్టాలి

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లాలో బీజేపీ క్రియాశీల సభ్యత్వం ముమ్మరంగా చేపట్టాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన క్రియాశీల సభ్యత్వ సమావేశంలో మాట్లాడారు. వంద మందిని బీజేపీలో సభ్యులుగా చేర్పించిన వారు క్రియాశీల సభ్యులుగా అర్హులన్నారు. రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించి క్రియాశీల సభ్యులుగా చేరాలన్నారు. ప్రతి మండలానికి వంద మంది క్రియాశీల సభ్యత్వం తీసుకునేలా చూడాలన్నారు. పార్టీలో బూత్ అధ్యక్షుడి నుంచి జాతీయ అధ్యక్షుడి వరకు క్రియాశీల సభ్యత్వం తీసుకోవాల్సిందేనని చెప్పారు. బీజేపీ సభ్యత్వ ప్రభారి ఆలే భాస్కర్, జిల్లా అధ్యక్షులు అరుణతార, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, నీలం చిన్నరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రావు, లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

దోమకొండ: పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని వారికి ఎల్లవేళలా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, గొట్టిముక్కుల గ్రామాల్లో ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ, ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్ రెడ్డి, నాయకులు చింతల రాజేష్, నరేందర్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కంది మనోజ్ కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బావిలోకి దిగి.. కుక్కపిల్లలను కాపాడి

భిక్కనూరు: కంచర్ల గ్రామంలోని ఓ వ్యవసాయబావిలో మూడు చిన్న కుక్కపిల్లలు ప్రమాదవశాత్తూ జారి పడిపోయాయి. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. బావిలో జారి పడిన చిన్న కుక్కపిల్లలు అరవడం ప్రారంభించాయి. దీన్ని గమనించిన తల్లి కుక్క గట్టుపైన నుంచి బావిలోకి తొంగి చూస్తూ అరవడం ప్రారంభించింది. కుక్క అరుపులు విన్న వారు అక్కడికి వచ్చి విషయాన్ని గ్రహించారు. బావిలోకి దిగి కుక్క పిల్లలను కాపాడాలి అనుకున్నప్పటికి బావి మొత్తం ముళ్ల పొదలతో నిండి ఉండటం, బావిలో పాములు కూడా గతంలో కనిపించడంతో ఎవ్వరూ బావిలో దిగేందుకు ముందుకు రాలేదు. విషయం తెలిసి గ్రామానికి చెందిన మెజీషియన్ సంతోష్ తన స్నేహితులు అశోక్, శ్రీనివాస్, అరవింద్, రాకేష్‌ల సహాయంతో బావిలోకి దిగి కుక్క పిల్లలను గట్టుకు చేర్చాడు. కుక్కపిల్లలను కాపాడిన మెజిషియన్ సంతోష్‌తో పాటు ఆయన మిత్రులను గ్రామస్తులు అభినందించారు.


కుక్క పిల్లను బయటికి తెస్తున్న సంతోష్

హాకీలో సత్తా చాటిన గర్గుల్ జెడ్పీహెచ్ఎస్


ప్రథమ స్థానం సాధించిన గర్గుల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు


ద్వితీయ స్థానం సాధించిన స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల విద్యార్థులు

కామారెడ్డి రూరల్: గర్గుల్ జెడ్పీహెచ్ఎస్‌లో అండర్–17 విభాగంలో బాల బాలికలకు జిల్లా స్థాయి హాకీ టోర్నమెంట్ మంగళవారం నిర్వహించారు. బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్(గర్గుల్) ప్రథమ స్థానంలో, స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల ద్వితీయ స్థానం సాధించినట్లు పీడీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నోముల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బాలికల విభాగంలో జెడ్పీహెచ్ఎస్(గర్గుల్) ప్రథమ స్థానంలో, కేజీబీవీ కామారెడ్డి ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బ్రహ్మం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హీరాలాల్, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్, ఆంజనేయులు, స్రవంతి, శృజన, మీనా, మానస, సంతోష్ రెడ్డి, అజయ్, విజయ్‌లు టోర్నీ నిర్వహించి సెలక్షన్స్ చేపట్టినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు నిజామాబాద్‌లోని డీఎస్ఏ గ్రౌండ్‌లో నవంబర్ 1న రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గిరిజన బాలికల ప్రతిభ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ సావిత్రి మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు క్రీడలలో పాఠశాల విద్యార్థులు బంగారు, కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. 3 కిలో మీటర్ల రన్నింగ్‌లో నందిని బంగారు పతకం సాధించగా, సునీత కాంస్య పతకం సాధించారు. 1500 మీటర్లు, 800 మీటర్ల రన్నింగ్‌లో అర్చన, కల్యాణిలు బంగారు, కాంస్య పథకాలను సాధించారని అన్నారు.

పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా శరత్‌చంద్ర



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శరత్ చంద్ర ప్రమోషన్‌పై హైదరాబాద్‌లోని పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. శరత్‌చంద్ర ఐదేళ్లుగా కామారెడ్డి కళాశాల డీన్‌గా పని చేశారని, విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్‌లు లభించడానికి విశేష కృషి చేశారని అధ్యాపకులు గుర్తు చేశారు. శరతచంద్ర ప్రమోషన్‌పై బదిలీ కావడంతో కళాశాలకు చెందిన సీనియర్ అధ్యాపకుడు కేఎస్. ఉమాపతిని అసోసియేట్ డీన్‌గా నియమించింది.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో వామన్‌రావు


హాజరైన క్షేత్రసహాయకులు, కార్యదర్శులు

- పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- అదనపు డీఆర్‌డీవో వామన్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినట్లు తేలినా వారిపై చర్యలు తప్పవని అదనపు డీఆర్‌డీవో వామన్ రావు అన్నారు. మంగళవారం లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక, సామాజిక తనిఖీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామి పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం 2023–24 సంవత్సరంలో చేపట్టిన పనుల వివరాలు, వాటి ఉపయోగాలు, ఖర్చు, ఏఏ పనులు చేపట్టారో క్షేత్రసహాయకులు, కార్యదర్శులు వివరించారు. మస్టర్లలో తప్పులను సరిదిద్దడం, రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో ఏ ఒక్క క్షేత్ర సహాయకుడిపై ఫిర్యాదు వచ్చినా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో ప్రశాంత్, జేక్యూసీ విప్లవ్‌కుమార్, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీలు మహేశ్వర్, దేవెందర్, ఎంపీడీవో నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దీపావళి ఉత్సవాల ఏర్పాట్లు



బీబీపేట: దీపావళి పండుగ సందర్భంగా ప్రతి ఏటా ముదిరాజ్ సదర్ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద బోనాలు, ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు సదర్ సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ముందుగా ఆలయం చుట్టూ వాహనాలను తిప్పిన తర్వాత ఎడ్ల బండ్లు, బోనాలు తీయాలని తెలిపారు.

నియామకం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): బొప్పాస్‌పల్లి గ్రామానికి చెందిన జాదవ్ పండరి వికలాంగుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం నియామక పత్రం అందించారు.

ఆయుర్వేద దినోత్సవం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య అవగాహన శిబిరంలో భాగంగా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై పరిశీలన చేసి అవసరమైన మందులను అందించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందించారు. ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఉదయిని, అకాడమిక్ కో–ఆర్డినేటర్ వనజ, కల్చరల్ కమిటీ కో–ఆర్డీనేటర్ సింధూర, వైద్యులు కీర్తన, దేవ, శ్రీకాంత్, జిల్లా ప్రోగ్రాం అధికారి జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి ఐకేపీ ఏపీఎంగా మనోహర్



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ఐకేపీ ఏపీఎంగా మనోహర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన రవీందర్ బదిలీపై మద్నూర్‌కు వెళ్లారు. అక్కడ ఏపీఎంగా పనిచేసిన మనోహర్ బదిలీపై తాడ్వాయికి వచ్చారు

గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

భిక్కనూరు: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యుడు వెంకటేశ్వర్లు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయడం వల్ల కలిగే లాభం గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ప్రిన్సిపాల్ రఘు, ఫార్మాసిస్టు రమణి, తదతరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కామారెడ్డి టౌన్: విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఖలీల్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పేద విద్యార్థులు చదువుకు దూరమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఏబీవీపీ నాయకులు వెంకటేశ్, రాజు, నవీన్, మానస, శివ, రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన నిందితుడి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలో దుబ్బ ఏరియాకు చెందిన విశ్వనాథ్‌పై కత్తితో దాడి చేసిన భాస్కర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథ్ తన స్నేహితుడైన భాస్కర్‌కి మూడు నెలల క్రితం రూ. 5వేలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని విశ్వనాథ్ పలుమార్లు భాస్కర్‌ని అడిగాడు. దీంతో విశ్వనాథ్‌ని చంపాలని నిర్ణయించుకున్న భాస్కర్ సోమవారం దుబ్బలోని శివాజీ చౌక్‌లో ఉన్న అతన్ని కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో దాడి చేశాడు. విశ్వనాథ్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టౌన్ సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో సిబ్బంది నిందితుడిని రెండు గంటల్లో పట్టుకొని అరెస్టు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

బోధన్‌రూరల్: మండలంలోని ఎరాజ్‌పల్లి, ఊట్‌పల్లి శివారులో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఇందులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2,800 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్


చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలీసు శ్రీనివాస్(43) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌పై నుంచి పడిన ఘటనలో మరొకరు..

ఖలీల్‌వాడి: బైక్‌పై నుంచి పడిన ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన షేక్ యూసుఫ్, అవినాశ్ ఇద్దరు స్నేహితులు. ఈ నెల 25న వీరు బైక్‌పై అతివేగంగా ప్రయాణిస్తుండగా ఉమెన్స్ కాలేజ్ కంఠేశ్వర్ వద్ద కిందపడ్డారు. ఈ ఘటనలో షేక్ యూసుఫ్ తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఉదయం అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రిహాన బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



సిరికొండ: మండలంలోని న్యావనంది చౌరస్తా సమీపంలో మంగళవారం రెండు మినీ వ్యాన్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ తన మినీ వ్యాన్‌తో భీంగల్ వైపు వెళ్తున్నాడు. బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన నారాయణ భీంగల్ వైపు నుంచి సిరికొండకు మినీ వ్యాన్‌లో వస్తున్నాడు. న్యావనంది చౌరస్తా సమీపంలో ఎదురెదురుగా వ్యాన్లు ఢీకొనడంతో శ్రీనివాస్ కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నారాయణకు చెందిన వ్యాన్‌ను పీఎస్‌కు తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎల్ రామ్ తెలిపారు.

బాలకృష్ణ హత్యకేసులో అనుమానాలెన్నో?

- సుపారీ ఇచ్చి హత్య చేయించారా?
- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు


మాచారెడ్డి పోలీస్‌స్టేషన్

మాచారెడ్డి: మండల కేంద్రానికి చెందిన దువ్వల బాలకృష్ణ(32) పాల్వంచ ఇసాయిపేట శివారులో సోమవారం రాత్రి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో పాటు క్లూస్ టీంతో దర్యాప్తు మొదలు పెట్టారు. మంగళవారం ఉదయం మృతుడి భార్యతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాల వ్యాపారం చేసుకొని జీవించే బాలకృష్ణను కాపు కాసి పథకం ప్రకారం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని గ్రామస్తులు 'సాక్షి'కి వివరించారు. బాలకృష్ణ హత్య నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పలువురు మహిళా కానిస్టేబుళ్లతో పాటు పోలీస్ బలగాలను మోహరించారు.

ఎంపీ ఫొటో మార్ఫింగ్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు


ఎఫ్ఐఆర్ కాపీ తీసుకుంటున్న ఎంఐఎం నేతలు

ఖలీల్‌వాడి: ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఫొటోను మార్ఫింగ్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీ అసదుద్దీన్ ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన నగరంలోని మాలపల్లికి చెందిన మాజీ కార్పొరేటర్ ఎంఏ ముఖీత్, ముంబైకి చెందిన సోషల్ మీడియా సంబంధించిన కలీమ్‌షేక్‌పై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫొటో మార్ఫింగ్‌పై ఒకటవ టౌన్ పీఎస్‌లో నగర ఎంఐఎం అధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్, నగర కార్యదర్శి మహ్మద్ షెహబాజ్ అహ్మద్ ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఫొటోలు మార్ఫింగ్ చేస్తే ఊరుకోం

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తే ఊరుకోమని నగర ఎంఐఎం అధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్, నగర కార్యదర్శి మహ్మద్ షెహబాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఒకటవ టౌన్ పోలీసుల నుంచి ఎఫ్ఐఆర్ కాపీని అందుకున్న తర్వాత వారు విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ చిత్రాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేశారని చెప్పారు. దీనిని వ్యతిరేకిస్తూ ఒకటో టౌన్ పీఎస్‌లో అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో ముహమ్మద్ ఇద్రీస్ ఖాన్, ముహమ్మద్ ఫయాజుద్దీన్, మీర్ మజాజ్ అలీ తదితరులు ఉన్నారు.

గుట్కా ప్యాకెట్లు సీజ్

బోధన్‌రూరల్: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సాలూర అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న తనిఖీలో మంగళవారం రూ.8వేలు విలువ గల గుట్కా ప్యాకెట్లు సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని బిలోలి గ్రామానికి చెందిన పాషా, చాంద్ అనే ఇద్దరు బస్సులో సాలూర నుంచి మహారాష్ట్ర వైపు గుట్కా ప్యాకెట్లను తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లాడ్జిపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మారుతి లాడ్జిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 10.30 గంటలకు ఇద్దరు వ్యక్తులు మారుతి లాడ్జ్‌లోకి ప్రవేశించి ఓ వర్గానికి చెందిన వ్యక్తులకు ఎందుకు గదులు ఇస్తున్నారని మేనేజర్ లక్ష్మిపై దాడిచేసి కౌంటర్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సజీల్‌పాషా, ఇమ్రాన్‌బిన్‌అలీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్/ బోధన్‌రూరల్: పోతంగల్ మండలం కొడిచర్ల నుంచి సిరిపూర్ వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య మంగళవారం తెలిపారు. ట్రాక్టర్‌ను చెక్‌పోస్ట్ వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పట్టుకుని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సాలూర మండలంలోని ఖాజాపూర్, మందర్న శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.